# రాబందులు

తూర్పు కొండల చాటునుంచి సూర్యుడు వళ్లు విరుచుకంటూ పైకి వస్తున్నాడు. ఐదు గంటలకే నిద్రలేచిన టౌన్ బస్సులు రూయా ఆసుపత్రి దగ్గర ప్రయాణీకుల కోసరం అరుస్తున్నాయి. ఆసుపత్రినుంచి ఎన్‌జివో కాలనీకి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా తురాయి చెట్లకింద రాలిన పూలను పిల్లలు ఏరుకుంటున్నారు.

హరేరామ హరేకృష్ణ మండపం వరకు కరువుతో పలు ప్రాంతాలనుంచి వలస వచ్చిన వాళ్లు చెట్లకిందే కాపురమున్నారు. ఆడవాళ్లు పొయ్యిలముందు కూర్చొని వంటతో కుస్తీ పడుతున్నారు. కొంతమంది మగవాళ్లు పడుకొనే బీడీలు కాలుస్తున్నారు. లేచిన వాళ్లు కాలకృత్యాలు తీర్చుకోవడానికి పక్కనే ఉన్న తిరుమల లింకు బస్టాండు దగ్గర చెట్లలోకి వెళుతున్నారు.

"ఏంబ్బీ రామచంద్రా....యింగా పొనుకొనే వుండావే. పనికొచ్చావా రావా" అంటూ పడుకోనున్న రామచంద్రను తట్టాడు రామయ్య.

రామచంద్ర ఉలికిపాటుగా లేచి కూర్చున్నాడు. "అంతా పనికి ఎలబారినారాన్నా" అంటూ గబగబా లేచి నిల్చున్నాడు.

"హ్హా...హ్హా...హ్హా... ఈ యబ్బికి ఏమాత్రం సూడీ పనంటే. యింగా సరీగా తెల్లార్నేలే. దినాము మాకన్నా బిరీన లేచ్చాంటివి గదా! అందుకని లేపినా" అన్నాడు రామయ్య నవ్వుతూ.

"అందరూ తిరుగులాడతాంటే పనికి టైమయిపోయిందేమో అని బిత్తర చుట్టుకొన్నె" అంటూ తిరిగి గోతంమీద కూర్చున్నాడు రామచంద్ర.

"ఏమప్పా మళ్లా కూచ్చొంటాండావు. ఈరోజు శనివారం కదా! కొంచెం ముందుగాల్నే పోవాల" అన్నాడు స్నానానికి వెళుతున్న నారాయణప్ప ఆగి.

"రాత్రి చానాసేపు నిద్రపట్టలేదన్నా. అందుకే పద్దన్నే మెలకవరాలా."

"పెండ్లిమీంద కలవరం మళ్లిందాప్పా. మా అనంతపురంలో చుక్క మాదిర్తో వుండాది పాప"

"పడకమిందే అరువులు జేచ్చాండారా. పనికి పోరా" అరచింది రామయ్య భార్య బియ్యం వార్చుతూ.

"పొద్దెగబడతాండాది. పనికాడికి నడుసుకోని పోవాలంటే గంటసేపు పడతాది" అంటూ లేచి తను పడుకోనున్న గోతాన్ని తీసి మడత బెట్టాడు రామచంద్ర. జారిపోతున్న లుంగీని నడుముకు గట్టిగా బిగించుకుని ఎదురుగా వున్న చెట్లలోకి వెళ్లాడు. అక్కడినుంచి వేపపుల్లతో పళ్లుతోముకుంటూ వచ్చాడు. చెట్టు తమరలో వున్న చేతిసంచీలోంచి తుండుగుడ్డతీసి లింకు బస్టాండులోపల వున్న కొళాయి వద్దకు స్నానానికి వెళ్లాడు.

రోడ్డుకు రెండు పక్కలా దాదాపు వంద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోంచే కాక తమిళనాడు, కర్నాటకలనుంచి వలస వచ్చిన వాళ్లుకూడా వున్నారక్కడ. పనికి ఎక్కువ దూరం పోవాల్సిన వాళ్లు చేతిలో క్యారేజీ పట్టుకుని భుజం మీద తుండుగుడ్డ వేసుకుని బయల్దేరేశారు. పని లేనోళ్లు పనికోసరం నాలుగ్గాళ్ల మండపం వద్దకు అందరికన్నా ముందే వెళ్లిపోయారు.

రామచంద్ర స్నానం చేసి వచ్చాడు. అప్పటికే అన్నంతిని, మిగిలింది కట్టుకోని పనికి పోవడానికి సిద్ధంగా వున్నారు రామయ్య, నారాయణప్ప దంపతులు.

రామచంద్ర ఆరడుగుల పొడవుంటాడు. చామనచాయ. పొడవుకు తగినంత లావు లేకపోయినా బలిష్టంగానే వున్నాడు. నూనూగు మీసాలు ముదరకముందే ముఖంలో లేతదనం మాయమయింది.

అందరూ పనికి బయల్దేరారు.

"మా తిక్కు వానలు పడి ఆరు సమచ్చరాలయింది."

"మా వూర్లో ఒగమనిషి గూడా లేరు. అందరం కడుపాత్రంతో దేశం మీద పడినాం"

"మాది హోస్‌పేట దెగ్గర. డ్యాం ఎండిపోయిండాది. అరవై ఏండ్లనించి ఎప్పుడేగాని ఎండిందిలే. యిప్పుడు తాగేకి గూడా చుక్కనీళ్లు లేవు."

రకరకాలుగా సాగుతున్నాయి వాళ్ల మాటలు.

"ఆర్నెల్లముందు ఈడ పనులు బాగుంటాన్నేయి."అన్నాడు రామయ్య.

"మన మాదిర్తో ఎవురూ వచ్చిండరు."

"ఎందుకు రాలేదబ్బీ...సమచ్చరం నించీ వుండారంట... అబ్బుడు అదేందో ఎర్త్ వైరంట. ఈ వీధికి ఏచ్చాన్నేరు. గజంలోతు గ్గాడితోగాల దానికి. ఆ పనులుత్తో అబ్బుడు జాచ్చిగా వున్నేయి. ఎంతమందుంటాన్నే పనుంటాండే."

"ఆ పనులు లేవా యిప్పుడు."

"కూలోల్లే చేసింటే సమచ్చరం పట్టిండు. మిసన్లొచ్చె. మనం పదైదు మందిమి రోజంతా చేసే పని అది గంటకే చేసేచ్చాండాది. యిప్పుడంతా వోటితోనే పని చేపిచ్చాండారు."

"ఎవురు చేసే పని వోళ్లు చెయ్యాల్లేప్పా. అయ్యి చేసేపని అయ్యి, మనం చేసే పని

మనం" అన్నాడు నారాయణప్ప.

"అయితే మీ అనంతపురంలోనే వుండి మీ పని చేసుకోనుండేది. ఇరవై ఎకరాల సేద్దిగాడ్నంటివే. ఈడికొచ్చి యిటికలు మోచ్చాండావే యాల?" ప్రశ్నించాడు రామయ్య.

నారాయణప్ప సమాధానం చెప్పలేక పోయాడు.

అందరూ లీలామహల్ దగ్గర ఎడమవైపు తిరిగి మంగళం రోడ్డులో నడవసాగారు.

"టిఫిను తినేసి వస్తాన్నా. మీరు పాండి." అని టిఫిను బండి వద్ద ఆగిపోయాడు రామచంద్ర.

గబగబా ఐదు రూపాయలకు ఇడ్లీలు తిన్నాడు. ముందు వెళ్లిన వాళ్లంతా పని చేయాల్సిన బిల్డింగు వద్దకు చేరేటప్పటికి రామచంద్ర కూడా చేరాడు. అప్పటికే మేస్త్రీ వున్నాడక్కడ.

"ఏమయ్యా... శనివారం పూటగూడా తీరుబాటుగా వస్తారా? ఈ రోజు పేమెంట్ ఇస్తాండ్లా. గంటముందుగా వచ్చి గంటలేటుగా పనెత్తినామంటే యింటి గలోల్లకు సంతోసం. పెండింగ్ పెట్టకుండా మన కూలీలు పారేస్తారు."అన్నాడు మేస్త్రీ.

"రోజు కన్నా ముందే వచ్చినామప్పా" నారాయణప్ప బదులిచ్చాడు.

"సరే...సరే... పాండి. పనిలో దిగండి" అన్నాడు మేస్త్రీ, నారాయణప్ప భార్యవైపు వెకిలిగా చూస్తూ.

ఆడవాళ్లు యిసుక జల్లించడానికి పూనుకున్నారు. మగవాళ్లు కొందరు జల్లించిన యిసుకను తీసుకుపోయి పై అంతస్తులో వేయసాగారు. కొందరు తట్టల్లో యిసుక తీసుకుపోయి బిల్డింగ్ వెనుక వేస్తున్నారు. రామచంద్ర నిల్చుని బిల్డింగును పరిశీలనగా చూశాడు. యింతింత పెద్ద బిల్డింగులు కట్టడానికి వీళ్లకు డబ్బు ఎక్కడినుంచి వస్తుంది అనుకున్నాడు.

"పద్దన్నే వస్తానే నిల్చుకొన్నేవే...యిట్లయితే మేము...పోవాల్సిందే కానీ పని" అన్నాడు మేస్త్రీ.

రామచంద్రకు కోపం వచ్చింది. అక్కడ పనిచేసే వాళ్లెవరూ తను చేసేంత పని చెయ్యలేరు. అందరూ సగం గోతానికి యిసుక మోస్తుంటే, తను గోతం నిండుకు మోస్తాడు. అందరూ ఏడు ఇటుకులు తీసుకుపోతుంటే తను పది తీసుకుపోతాడు. అవన్నీ తెలిసే ఎంత మాటన్నాడు మేస్త్రీ అనుకొన్నాడు. రోజులు తమవి కావు అనుకుని మౌనంగా పనిలో మునిగిపోయాడు. తాపీ మేస్త్రీలు గంట తర్వాత వచ్చారు. ప్రహరీ గోడ పని ఒకవైపు, లోపల గోడలకు పూతపని మరోవైపు జరుగుతోంది. యింటి ఓనర్స్ వచ్చి వెళ్లారు. మధ్యాహ్నం ఒకటిన్నరకు పనులాపి అందరూ కిందకు చేరారు. అన్నం తెచ్చుకోనుండే వాళ్లకు వక్కాక్కు బీడీలకని పది రూపాయలు, అన్నం తెచ్చుకోనోళ్లకు ఇరవై ఐదు రూపాయలు యిచ్చాడు మేస్త్రీ.

"అందరికీ యిచ్చినా కదా... పైన ఎవురన్నా వుండారా?"

"ఎవరూ లేరున్నా. అందరం ఈన్నే వుండాము" అన్నాడొకతను.

"బిందెతో నీళ్లు పైకితే" నారాయణప్ప భార్యకు పని పురమాయించి పైకి వెళ్లాడు మేస్త్రీ.

భర్తవైపు చూసిందామె. నారాయణప్ప భార్య ముఖంలోకి చూడకుండా తప్పు చేసిన వాడిలా తలదించుకున్నాడు. డ్రమ్ములో వున్న నీళ్లు బిందెతో ముంచుకుని పైకి వెళ్లిందామె. రామచంద్ర దగ్గర్లో వున్న రోడ్డు వద్దకు వెళ్లాడు. చెట్టుకిందవున్న బండి వద్ద పది రూపాయలకు సంగటి తిని వచ్చాడు. అప్పటికే అందరూ తినేసి యిసుకలో కూర్చొని వున్నారు. కొందరు బీడీలు వెలిగించారు. కొందరు వక్కాకు నములుతున్నారు. ఒకతను వెల్లకిలా పడుకొని గురక పెడుతున్నాడు.

"మీ వూరోడు పోయినోడు పోయినట్టే వుండాడే. రానేలేదే?" అడిగాడు రామయ్య.

"వానికోసరమే ఎదురు చూస్తాండా. యింట్లో అమ్మానాయన ఎట్లుండారో ఏమో. మా చెల్లెలు ఈసారి పది. బడికి అంపతాండారో లేదో. నేనేమో చెప్పంపినా, బాగా చదివించమని" అన్నాడు రామచంద్ర.

"చదవనీకి లెక్క కావద్దేమప్పా. కరువుతో తిండిగింజలు లేక చస్తాంటే చదువేడ."

"మీ వోళ్లందర్ని పిల్సకచ్చింటేబ్బీ" సలహాయిచ్చాడు రామయ్య.

"పిల్సకస్తే యిబ్బందవుతాదన్నా. అమ్మా నాయన పని చెయ్యలేరు. చెల్లెల్ని పనికి తీసకరావడం నాకిష్టం లేదు. నా ఒగని సంపాదనతో అంతమంది బతకాలంటే అవతాదా? నేనంటే చెట్టుకింద వుంటాండా. అందరం చెట్టుకిందే అంటే యాడన్నా;"

"యిట్లయితే నేను బాగుపడినట్టే. పనిలో దిగండి."అంటూ వచ్చాడు మేస్త్రీ.

అందరూ గబగబా లేచారు. తాము చేస్తూ వదిలిపెట్టిన పనులను తిరిగి ప్రారంభించారు. పనిచేస్తున్నాడే కానీ రామచంద్రకు మనసు మనసులో లేదు. అతను తిరుపతికి వచ్చి నెలవుతావుంది. మొదటివారం సంపాదన తిండికే చాల్లేదు. మిగతా రెండు వారాలకు గాను మూడు వందలు మిగిలింది. తనతోపాటు వచ్చి పనిచేస్తా వుండిన రమణ వూరు వెళ్తుంటే ఆ డబ్బు యిచ్చి పంపాడు. అతనొస్తాడు, యింట్లో వాళ్ల క్షేమసమాచారాలు చెప్తాడు అని రోజూ ఎదురు చూస్తూనే వున్నాడు. కానీ రమణ రాలేదు. సాయంత్రం వారం రోజుల కూలి డబ్బు తీసుకుని వూరికి పోవాలనుకున్నాడు.

"సందేళ గంట లేటయితాది. ఈన్నే వుండండి. వచ్చి పేమెంట్‌లు యిస్తాను." అని చెప్పి వెళ్లిపోయాడు మేస్త్రీ.

మేస్త్రీ లేకపోవడంతో అందరూ మాటలు చెప్పుకుంటూ హుషారుగా పనిచేయసాగారు.

సాయంత్రం ఆరయింది. శనివారం డబ్బు యిస్తారు కదా అని మరో గంటసేపు అదనంగా పనిచేశారంతా. ఏడు గంటలకు పని నిలిపి కాళ్లు చేతులు కడుక్కొని, బిల్డింగ్ ఎదురుగా వుండే యిసుకలో కూర్చున్నారంతా. ఒకరి కష్టసుఖాలు మరొకరు పంచుకుంటున్నారు మాటల్లో.

"ఏమప్పా రామచంద్రా...యింతమంది అరువులు చేస్తాంటే నువ్వుగమ్మున్నే వుండావే" అడిగాడు నారాయణప్ప.

"యింటిమింద గాలి మల్లిందేమో" అన్నాడు రామయ్య.

"రమణ యింకా రాలేదన్నా. వారమయితాండాది. యింటికాడ ఎవురికన్నా బాగలేదేమో. నాకెందుకో కడుపులో ఒకటే యేదనగా వుండాది. మేస్త్రీ దుడ్డుయిస్తానే వూరికి పొయ్యేసి వస్తా."

"మొబ్బయి పోయిండాది. మేస్త్రీరాలా. యింగెప్పుడన్నా పొయ్యేది." అంది నారాయణప్ప భార్య వక్కాకు నములుతూ.

"పీలేరు దాంకా బస్సుంటే చాలు. ఆట్నుంచి పన్నెండుకో, తెల్లార్జామున మూటికో పాల్లారీ వుంటాది."

అందరూ మాటల్లో వున్నారేగానీ ఆకలి వాళ్లను ప్రశాంతంగా వుండనివ్వటంలేదు. మధ్యాహ్నం తిన్న చాలీచాలని తిండి ఎప్పుడో అరిగిపోయింది.

ప్లంబర్ మేస్త్రీ, కార్పెంటర్ మేస్త్రీలు వచ్చారు. వాళ్లవాళ్లకు డబ్బు పంపకం అయిపోయింది. వాళ్లంతా ఆనందంగా అక్కడినుంచి వెళ్లిపోయారు. మిగిలింది తాపీమేస్త్రీ పనివాళ్లే. అందరిలో అసహనం, మేస్త్రీ కోసం కాసుకోనుండారంతా. రాత్రి తొమ్మిదన్నర అవుతుండగా యింటి ఓనర్స్ కారులో వచ్చారు. వాళ్లను చూడగానే కూర్చున్నచోట నుంచి అందరూ లేచారు.

వాళ్లు కారులోంచి దిగి వీళ్లవద్దకు వచ్చి "ఏమింకా యిక్కడే వున్నారే" ప్రశ్నించారు.

"యింగా దుడ్డీలేదు సార్" అన్నాడు రామచంద్ర.

"ఏం డబ్బు"

"మాకు కూలీ"

"మధ్యాహ్నమే తీసుకున్నాడే సాయంత్రం వూరికి పోవాలని, మేస్త్రీ మీకు యివ్వలేదా?"

"లేదు సామీ" అన్నాడు కంగారుగా రామయ్య.

"యింగ రెండువారాలు రానన్నాడు. ఏదో వూరు పోవాలని చెప్పాడు."

"ఆఁ... మాకు ఒగరికి కూడా లెక్కీలేదప్పా. బీడీ వక్కాక్కు గూడా మాతావనలెక్కలేదు." అన్నాడు నారాయణప్ప.

"నేనయితే అప్పుడే యిచ్చేశాను. మేస్త్రీ యింటికి పోయి తీసుకోండి." అంటూ కారెక్కారు వాళ్ళు.

"మాకాడ ఒగరూపాయి గూడా లేదు సార్. తలా నూర్రూపాయలీండి. రేపారం పట్టించేస్తాం." అడిగాడు రామయ్య.

"నోనోనో...నాదగ్గర లేదింక. మీ అందరి మస్టర్‌లు లెక్కలేసి, అంతకన్నా తౌజండ్ రూపీస్ ఎక్స్ట్రాగానే తీసుకున్నాడు. డబ్బు కావాలంటే మేస్త్రీ దగ్గరే. నా దగ్గరేం లేదు." అంటూ వెళ్లిపోయారు కారులో.

"మేస్త్రీ యిల్లు తెలుసా" అడిగాడు రామచంద్ర.

"రామయ్యన్నకు తెలుసేమో"అన్నాడు నారాయణప్ప.

"నాకు తెలీదు. బేల్దార్ మేస్త్రీలకు తెలుసేమో."

"మాక్కూడ తెలీదే. పనికోసరం మట్టపలక పట్టుకోని మంటపంకాడ వుంటే వచ్చి తీసకచ్చినాడు. ఆయన యిల్లు ఏ వీధిలో వుందో ఎవురూ అడగలా. ఆయనా చెప్పలా" అన్నారు మేస్త్రీలు.

డబ్బు యివ్వకుండా పోయినందుకు మేస్త్రీని తిట్టుకుంటూ బయల్దేరారు.

అంతవరకున్న కాస్త హుషారు కూడా తగ్గిపోయింది అందరిలో. రామచంద్ర నిక్కరు జేబును తడుముకున్నాడు. అంతా చిల్లర. నడుస్తూనే లెక్కవేశాడు. ముప్పై ఐదు రూపాయలుంది. మేస్త్రీ భోజనానికి ఇరవై ఐదు రూపాయలు యిచ్చేవాడు. ఉదయం టిఫనుకు ఐదు, మధ్యాహ్నం సంగటికి పది, రాత్రి సంగటికి ఐదు ఖర్చు చేసేవాడు. వారం రోజులుగా మిగిలిన డబ్బు ముప్పై ఐదు వుంది.

"మేస్త్రీ వస్తాడాన్నా." అన్నాడు రామచంద్ర.

"యాడ...వానేలీ తాడుదెగా....లంజకొడుకు. యింత మోసం చేస్తాడనుకోలా" అన్నాడు నారాయణప్ప.

"ఆడ సేద్దిం జేద్దామంటే వాన మోసం జేచ్చాంది. ఈడ పనులు జేద్దామంటే మేస్త్రీలు మోసం జేచ్చాండారే" అన్నాడు రామయ్య బాధగా.

అందరూ మాట్లాడుకుంటూ తామున్న చెట్లవద్దకు చేరుకున్నారు. రాత్రి పది దాటుతున్నా అక్కడ సందడిగానే వుంది. శనివారం కావడంతో చాలామంది ఆలశ్యంగానే వచ్చారక్కడకు. అప్పటికే కొంతమంది తమ సంపాదనలో చాలా భాగం తాగుడుకే ఖర్చు పెట్టేశారు. ఆడవాళ్లు దోబూచులాడుతున్న వీధి దీపం వెలుగులో వంట ప్రయత్నం చేస్తున్నారు. కొందరాడవాళ్లు చెట్లకింద చీకట్లో స్నానం చేస్తున్నారు.

"తినకుండా వచ్చేస్తివేమప్పా." అన్నాడు నారాయణప్ప రామచంద్రతో.

"తినబుద్ధికాలాన్నా."

"బాదగా వుండాదా. వచ్చాదిలే లెక్క. మన రెక్కల కష్టం బీటికి పోదులే. తినేసి రాపోబ్బీ" అంటూ ధైర్యం చెప్పాడు రామయ్య.

"ఆకలి పోయిందన్నా"

"ఏరా రామచంద్రా... ఈయరవ దాంకా పని చేస్తాన్నేరా?"

"నువ్వెప్పుడు వచ్చినావురా... మా అమ్మానాయనా చెల్లెలు బాగుండారా రమణా, వానలు పన్నేయా, యింట్లో ఏం చెప్పినారు" ప్రశ్నల వర్షం కురిపించాడు రామచంద్ర.

"ఎనిమిది గంటలకు వచ్చినా. నిన్ను మీనాయన కలవరిస్తాండాడురా. యింగో రెండునూర్లు దుడ్డు గావాలంట" అన్నాడు రమణ.

"మూడు నూర్లు యిచ్చినావు గదా. నెలనెలా అంపతానని చెప్పలా."

"నెలనెలా పంపేది కాదురా. యిప్పుడు అవసరం."

"ఏమవసరం? యింట్లో ఎవురికన్నా బాగలేదా?"ఆదుర్దాగా అడిగాడు రామచంద్ర.

"నేను వూరికి పోతినే. దానికి రెండు దినాల ముందు మీనాయన యిటికి పనికి పొయ్యిన్నేడంట. తట్టతో మన్ను మోస్తాన్నేడంట. బట్టీ కాల్చేదానికి చింతతుండును మేకులు పెట్టి చీలస్తాంటే, కట్టినుంచి సమ్మెట జారిపోయొచ్చి ఎదురొమ్మున తగిలిందంట. మీ నాయన నొప్పికి అన్నే పడిపాయనంట."అని వివరించాడు రమణ, డబ్బు అవసరాన్ని చెప్పకనే చెబుతూ.

"అవునా..?! ఎట్లుందిరా.. వూరికి పోవాల్నే." అన్నాడు రామచంద్ర ఏడుపు గొంతుతో.

"కరువు కాలంలో ఏమేమి సంకటాలు వస్తాండాయో"అన్నాడు నారాయణప్ప.

"బాదపడద్దులేరా. యిప్పుడు బాగనే వుండాది. రెండుతూర్లు కల్లూరుకుపోయి పట్టేపించుకోని వచ్చినాడు. నీకు చెప్పద్దన్నేడు... నేనే చెప్పేసినా."

యింకా వూరిలోని అందరి గురించి చెప్తూనే వున్నాడు రమణ. రామచంద్ర అతని మాటలను పట్టించుకొనే స్థితిలో లేడు. 'ఎట్లన్నాగానీ, వూరికి పోవాల. నాయన్ను చూడాల' అనుకొన్నాడు చేతిలో నలభై రూపాయలు కూడా లేవు. ఎవరినన్నా అడుగుదామంటే మిగిలిన వాళ్ల పరిస్థితి తనకన్నా అధ్వాన్నం. పొద్దున్నే పనికి పోయి రాత్రికి వూరుకుపోవాల అనుకొన్నాడు. కొళాయి వద్ద నీళ్ళు తాగేసి వచ్చి గోతం పట్ట పరచుకుని పడుకున్నాడు. అతని పక్కనే చోటు చేసుకున్నాడు రమణ.

రాత్రంతా రామచంద్ర పొర్లుతూనే వున్నాడు. కడుపు ఖాళీగా వుండటం, నాన్నకు ఆరోగ్యం బాగలేదని తెలవడం, మేస్త్రీ డబ్బు యివ్వకపోవడం... అతడ్ని స్థిమితంగా వుండనివ్వలేదు. తెల్లవారుజామున ఎప్పటికో నిద్ర పట్టింది.

వేసవి కాలం కావడంతో సూర్యుడు ఆరుగంటలకంతా కొండమీదకు చేరాడు. తురాయి చెట్లకింద పిల్లలు అర్ధనగ్నంగా ఆడుకొంటున్నారు. ఆదివారం కావడంతో ఆడవాళ్లింకా వంటపని ప్రారంభించలేదు. మగవాళ్లు చింపిరి జుట్టును సవరించుకుంటూ నిద్రలేస్తున్నారు. టౌన్ బస్సుల బెడద, లింకు బస్టాండులో యాత్రికుల కోలాహలం మొదలయింది. తిరుమల కొండకు

రాత్రి ఎవరో పెట్టిన అగ్గి, యింకా పొగలు చిమ్ముతూనే వుంది. రామచంద్ర వులికిపాటుగా లేచి కూర్చున్నాడు.

"తెల్లారిపోయిందా" అంటూ ఆదరాబాదరా లేచి నిల్చున్నాడు.

"ఆదివారమే గదాన్నా...యాడికి పోవాల?" అంది నారాయణప్ప భార్య.

"పనికి పోవాలమ్మా" అన్నాడు లుంగీని నడుముకు బిగించి కడుతూ.

"మేస్త్రీ లెక్కే ఈలా... పనేడుంది" అన్నాడు రామయ్య.

"వూరికి పోవాలన్నా...దుడ్డు కావాల. మంటపంకాడికి పోతా. ఏదో ఒగపని దొరకతాది. ఆట్నించట్లే మా వూరికి పోయొస్తా. ఈ పాటికి ఆడికి పోయింటే బాగుండు" అంటూ గబగబా నడచుకుంటూ చెట్లల్లోకి వెళ్లాడు. పది నిమిషాల్లో స్నానం చేసి వచ్చాడు. అప్పటికి రమణ నిద్రలేచాడు.

"యాడికిరా....పద్దన్నే తయారయినావు"

"పనికి"

"ఆదివారం కదా, పనేడుంటాది?"

"మండపం కాడికి పోతారా" చెట్టులోనించి చేతి సంచిని తీసి చొక్కా తీసి వేసుకున్నాడు.

"వారమంతా పని చేసినావు. ఒగరోజన్నా గమ్మునుండరా"

"గమ్మునుంటే, నాయన్ను చూడాలని వుండాది. దుడ్డు కావద్దా"

"అందుకే... మీనాయన చెప్పద్దన్నేడు. చెప్పకుండా వున్నే బాగుండు" ఆవులిస్తూ అన్నాడు రమణ.

"ఫోన్ చెయ్యప్పా" సలహా యిచ్చాడు నారాయణప్ప.

"మా వూర్లో ఎవురికే గాని ఫోన్ లేదన్నా" సమాధానం చెప్పాడు రమణ.

"సరే...నేనుపోతారా..పని దొరికితే చేసి, రాత్రికి అట్లే వూరికి పోతా. రేపోమన్నాడో వస్తా." అని చెప్పి చేతిసంచితో బయలుదేరాడు రామచంద్ర.

నడుచుకుంటూ గాంధీ రోడ్డు దగ్గరున్న నాలుగ్గాళ్ల మండపం వద్దకు చేరేప్పటికి ఏడు గంటలయింది. అప్పటికే అక్కడ పనికోసం కొన్ని వందల మంది కాసుకోనుండారు. కొందరి చేతుల్లో కరిణెలు, మట్టపలకలూ వున్నాయి. కొందరి దగ్గర పెయింట్ డబ్బాలు, అరటి బ్రష్‌లు వున్నాయి. గుంపులు గుంపులుగా కూర్చొని, నిల్చొని మాట్లాడుకుంటున్నారు. అక్కడ ఎవరైనా వాహనం ఆపినా, మనిషి నిలబడి మాట్లాడినా అతని చుట్టూ మూగి పోతున్నారంతా. పనిదొరికిన వాళ్లు పోతున్నారు.

తొమ్మిది గంటలు దాటింది. సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. రామచంద్రకు పని దొరకలేదు. ఎండకు తాళలేనివారు మంటపం వద్ద నీడలో చేరారు. రామచంద్ర రోడ్డుమీదే

నిల్చొని వున్నాడు. రాత్రి తినకపోవడంతో పొద్దున్నే విపరీతమయిన ఆకలిగా వుందతనికి. తింటే డబ్బయిపోతాది. చార్జీలకు చాలదు. వూరికిపోలేను అనుకుని టిఫిను తినలేదు. ఖాళీ కడుపు. రేపటెండ. కళ్లు తిరుగుతున్నట్లున్నా నీడకు వెళ్లలేదు. వచ్చిపోయే వాళ్లను గమనిస్తూ నిల్చునే వున్నాడు.

ఒకతను స్కూటర్ మీద వచ్చాడక్కడకు. బెల్లం చుట్టూ మూగిన ఈగల్లా అతన్ని చుట్టుకున్నారంతా.

"నాక్కావలసింది. ఒక్క మనిషేనయ్యా. యింతమంది అవసరంలేదు." అన్నాడతడు.

"ఏం పనా చెప్తా" అంటూ అందరినీ పరిశీలనగా చూసి వొడ్డూ పొడవూ వున్న రామచంద్రతో "వస్తావా" అన్నాడతను.

"వస్తా సార్" అన్నాడు కాళ్లదగ్గరుండే సంచిని చేతికి తీసుకుంటూ.

"సెప్టిక్ ట్యాంక్‌కు గుంత తొగ్గాల. కొంచెం తొగిండారు. రేపు మేస్త్రీలు వచ్చాలకు రెడీగా తొగిస్తానన్నే" అన్నాడతను.

"పార పనయితే బయమే లేదు సార్. తొగేస్తాను." అన్నాడు వుత్సాహంగా రామచంద్ర.

అతను స్కూటర్ స్టార్ట్ చేశాడు.

"పనేడ సార్. సాయంత్రం మా వూరికి పోవాల. బస్టాండుకు రావల్ల."

"ఏవూరు మీది"

"పీలేరు దెగ్గిర"

"అయితే యిబ్బంది లేదులే. ఎర్రమిట్టలో మేముండేది. బస్సులన్నీ మా యింటిదగ్గర బైపాసింటీపోతాయి. పనయిపోతానే నువ్వు అన్నే బస్సెక్కేయొచ్చు."

రామచంద్ర అతని వెనక కూర్చున్నాడు. స్కూటర్ వేగంగా వెళ్లసాగింది. తను అప్పుడే తమ వూరికి పోయినంత సంతోషంగా వున్నాడు. పని దొరికింది. సాయంత్రం డబ్బు వస్తుంది. రాత్రికి యింటిదగ్గర వుంటా అనుకున్నాడు.

స్కూటర్ ఎర్రమిట్ట చేరుకుంది. యిద్దరూ దిగారు.

"యిదే గుంత.. ఎంత, రెండడుగుల లోతు తవ్వాలంతే. నాలుగ్గంటలకంతా ఐపోతాది. పనయిపోతానే ఎలబారిపో. కూలి యిచ్చేస్తా"అన్నాడతను.

గుంత ఏడడుగుల పొడవు. ఐదడుగుల వెడల్పు వుంటుందని కళ్లతోనే అంచనా వేశాడు రామచంద్ర. అప్పటికది నాలుగడుగుల లోతు తవ్వింటారంతే. సాయంకాలానికి పనికాదేమో అనుకున్నాడు. అది తప్పితే వేరే పనిలేదు. పని లేకపోతే వూరికి పోలేడు. నాయనను చూడలేడు. గబగబా చేస్తే అయిపోతుందిలే అనుకున్నాడు. చొక్కా తీసి మడతపెట్టి చేతిసంచిలో పెట్టాడు.

"చెంబుతో నీళ్లీండి సార్"

"అదో...ఆ మూల వుంది బిందె. ఎన్ని కావాలో తాగు. అయిపోతే ఆ పక్క స్విచ్చివుంది. మోటరేసుకో" అన్నాడతను.

రాత్రినుంచి తినకపోవడంతో కడుపు వీపుకు అతుక్కుపోయింది. ప్లాస్టిక్ బిందెలో నీళ్లను అంచులు పగిలిన స్టీలు గ్లాసుతో ముంచుకుని తాగాడు. ఐదు గ్లాసుల నీళ్లు తాగితేగాని రామచంద్ర కడుపు శాంతించలేదు.

"గడ్డపార, పార ఈసార్" అన్నాడు పనిలోకి దిగడానికి సిద్ధమవుతూ.

"వాటికోసమే తాలాడతాండా. నిన్న మా వాచ్‌మేన్ నా మీద అలిగి ఎల్లిపాయ. వాడేడికి పోతాడులే. తిరుక్కోని రాడామల్లా. నెలనెలా మొదులు తేదీకి నాకు జీతం రాకపోయినా వాడికి ఎనిమిది నూర్లు యిచ్చేస్తాండా. వాళ్ల అన్నకు ఆపరేషనంట. ఐదు వేలు కావాలన్నేడు. లేదన్నే. అందుకూ అలుగు. వుండాయి...గడ్డపారుండంతే...పారయాడుంది?" అంటూ కొయ్యల్లో కలిసిపోయున్న గడ్డపారను బయటకు తీశాడు. ఈలోపు రామచంద్ర చుట్టూ వెతికి బాత్‌రూంలోంచి పారను తీసుకొచ్చాడు.

"యిది చాలామంచి ఏరియా. పొరకపుల్లగూడా దొంగతనం కాదు." అన్నాడతను.

"సాయంత్రం పనయిపోతానే దుడ్డు యిచ్చేస్తావు గదాసార్" అన్నాడు రామచంద్ర గుంతలోకి దిగుతూ.

"నా సంగతి నీకు తెలీదు. మా యింటిపని చేసిన మేస్త్రీలుగానీ, ఆచార్లుగానీ, పెయింటర్లుగానీ జీవితాంతం తలచుకోవాలనన్ను. శనివారం ఆరుగంటలు అయితానే వాళ్లు అడక్కముందే లెక్కేసి కూలీలు యిచ్చేస్తా. చానా కరెక్ట్ మనిషిని. పగలంతా కష్టపడేవోళ్లు. మిమ్ములన్ను ఆపుకుంటానా?"అన్నాడతను.

రామచంద్ర గడ్డపారను చేత్తోతాకి కళ్లకద్దుకున్నాడు. దాన్ని రెండు చేతులతో పట్టుకుని పై కెత్తి బలంగా వేశాడు. నాలుగంగుళాలకు మించి దిగలేదు భూమిలోకి.

"రాత్రి నీళ్లు పోసింటే బాగుండుసార్" అన్నాడు తవ్వుతూనే రామచంద్ర.

"మా వాచ్‌మేన్‌కు చెప్పినా. వాడు పట్టినట్లులేదు. రోజూ పడతాండేదే కదా. తెగతాదిలే."

కొంతసేపు గడ్డపారతో తవ్వాడు. తవ్విన మట్టిని పారతో ఎత్తి తట్టలో వేసి పైకి విసిరాడు. అలా నిలకడ లేకుండా పని చేయసాగాడు. అతను కుర్చీ వేసుకుని కూర్చుని మాటలు చెబుతూనే వున్నాడు. రామచంద్ర వింటున్నాడో లేదో కూడా గమనించలేదతను. రెండు గంటలు తవ్వింతర్వాత మంచినీళ్ల కోసం పైకి వచ్చాడు. అప్పటికే చెమటతో తడచిపోయాడు.

"టీ అలవాటుందా" అన్నాడతను నీళ్లు తాగుతున్న రామచంద్రతో

"పొగులంతా పనిచేసేవాళ్లం కదా సార్... రెండుపూటలా వుడుకుడుగ్గా టీ తాగితే వుషారుగా వుంటాది"

ఖాళీ కడుపులోకి టీ నీళ్లన్నా పడతాయేయో అని ఆశపడ్డాడు.

"మాకు టీ, కాఫీ అలవాటు లేవయ్యా. యింట్లో పద్దన్నే సద్ది తాగతాం. అంతే" అన్నాడతను.

టీ తీసేడని అర్థమయింది రామచంద్రకు. మౌనంగా పని చేసుకుపోసాగాడు. మధ్యాహ్నం రెండుగంటలయింది.

"అన్నం తినేసి రాపో.." అంటూ పది రూపాయలిచ్చాడతడు.

గుంతలోంచి పైకి వచ్చి కాళ్లు చేతులు కడుక్కున్నాడు.

"రోడ్డుపైన్నే వుండాది హోటలు. సంగటి, కుష్కా బిర్యానీ...ఏది కావాలన్నా వుంటాది. తినేసి రాపో...యిప్పుడే చెప్తాండా. సాయంత్రం గొడవ పడొద్దు. ఈ పది రూపాయలు నీ కూలీలో పట్టుకుంటా."

"యింత కష్టం చేస్తాండా. పదిరూపాయలు ఎగేసి ఈసార్."

"లేదు లేదు...లెక్కంటే లెక్కే...తొందరగా వచ్చెయ్..."

"వచ్చేస్తా సార్" అంటూ రోడ్డుమీదకు వెళ్లాడు రామచంద్ర. పీలేరు బస్సు ఎదురయింది. ఎక్కేద్దామా అని వూగిసలాడింది మనసు. ఎక్కేస్తే వూరికి పోగలడంతే. తిరిగి రావాలంటే...ఆడ అప్పుకూడా పుట్టదు. సాయంత్రం పోదాంలే. యింకెంత...నాలుగు గంటలే కదా అనుకొన్నాడు.

తమ వూరికి చార్జీలు లెక్కవేశాడు. 'పీలేరుకు ఇరవై ఏడు. అక్కడినుంచి తొమ్మిది. పొయ్యేదానికి ముప్పై అరు. పోనూరానూ డెబ్బై రెండు. చేతిలో ముప్పై ఐదు ఉంది. అరవై కూలేసుకున్నా. యిప్పుడు పదిపోయినా, సాయంత్రం యాభై వస్తాది. మొత్తం ఎనబై ఐదవుతాది. చార్జీలు పోను పదమూడు రూపాయలు వుంటాది. నాయనకు జాంగ్రీ అంటే యిష్టం. మిగిలిన దుడ్డుకు తీసకపోవాల." అనుకొన్నాడు.

హోటలు దగ్గరకు పోయాడు. మళ్లీ ఆలోచించాడు. 'ఒకవేళ సాయంత్రం కూలీ యాభయ్యే యిస్తే, యిప్పుడు సంగటి తినేస్తే, సాయంత్రం చేతికి నలభయ్యే వస్తాది. చార్జీలకు సరిపోతాది. నాయనకు జాంగ్రీ తీసకపోలేదు. యిప్పుడు తినేది వద్దులే. ఆయన అరవై యిస్తే ఏదన్నా తినే బస్సు ఎక్కచ్చు' అనుకొన్నాడు.

హోటలు నిండుకు జనం వున్నారు. చికెన్, మటన్, బిర్యానీల వాసనలు ముక్కుపుటాలను అదరగొడుతున్నాయి. ఆ వాసనలు పీల్చేప్పటికి రామచంద్రలో ఆకలి విజృంభించింది. తింటున్నవాళ్లందరివైపు ఈర్ష్యగా చూసాడు. ఆహార పదార్థాలను చూడగానే అతడి నోట్లో నీళ్ళూరాయి.

మాసిన బట్టలు, చింపిరి జుట్టూ, మట్టిగొట్టుకున్న శరీరంతో వున్న రామచంద్రను చూసి "ఏంకావాలి?" అన్నాడు హోటల్లో కుర్రాడు.

"నీళ్ళు...." అన్నాడు రామచంద్ర.

"ఆడుండాయి చూడు." ఒక మూలకు చేయి చూపించాడు వాడు.

అక్కడకు వెళ్లి రెండు చెంబుల నీళ్లు తాగాడు. ఖాళీ కడుపులోకి ఎక్కువ నీళ్లు పోవడంతో వాంతి వచ్చేలా అనిపించింది అతనికి. గబగబా బయటకు వచ్చేశాడు. కొంతసేపు ఫుట్‌పాత్‌మీద చెట్టునీడనే కూర్చున్నాడు. పీలేరు, మదనపల్లి బస్సులు వస్తున్నాయి పోతున్నాయి. నాయనకు ఎట్లుందో ఏమో. తొందరగా పోవాల అనుకొన్నాడు. పనివద్దకు వెళ్లాడు. ఇంటి వోనర్ అప్పటికే తినేసి వచ్చి కూర్చోనున్నాడు.

"పక్కన్నే వుంటే హోటల్‌కాడికి పోయేసి వచ్చేదానికి యింతసేపా, నేను భవానీ నగర్‌కు పోయి తినేసి వస్తాండా." అన్నాడతను.

"స్కూటర్ కదా సార్. ఎంతసేపు పడతాది." అంటూ పనిలో దిగాడు.

ఒక్క నిముషం కూడా ఆగకుండా పనిచేయసాగాడు. చెమటతో ముద్దయిపోయాడు. రెండు సార్లు నీళ్లు తాగాడు. మసక చీకట్లు కమ్ముకుంటున్నాయి. వీధి దీపాలు వెలిగాయి. అక్కడ కూడా ఒక బల్బు వెలుగుతోంది.

"యింగ చాలా సార్" అన్నాడు రామచంద్ర నుదుటనున్న చెమటను తుడుచుకుంటూ.

"ఏదీ....వుండు" అంటూ అతను జేబులోంచి మెజర్‌మెంట్ టేపు తీశాడు. కిందికొసను రామచంద్ర పట్టుకున్నాడు. అతను పైన చూసి "యింకా ఒకడుగు తెగాల."అన్నాడు.

"పొద్దుపోయింది సార్. మా వూరికి పోవాల"

"నన్నేం చేయమంటావు. నేను ముందే చెప్పినా కదా, పనైపోతానే పొమ్మని. తొందరగా తవ్వి ఇంకా ముందుగా పొయ్యిండేది. నేనేమన్నా వద్దనిందునా. పద్దన్నే మేస్త్రీలు వస్తారు. పని పంచేటవుతాది. యింకెంత, ఒకడుగే కదా. తొగెయ్."అన్నాడతను.

రామచంద్రకు నీరసంగా ఉంది. కళ్లు తిరుగుతున్నట్టున్నాయి. తిరిగి పని ప్రారంభించాడు. గంట, రెండు గంటలు, మూడు గంటలు.....ఏకధాటిగా తవ్వాడు. రాత్రి పది గంటలు కావొస్తోంది. శరీరం సహకరించడంలేదు.

"ఇంగ నానింటి కాదు సార్. నువ్వు చెప్పిందానికన్నా ఎక్కువే తొగినా" అన్నాడు రామచంద్ర.

అతను గుంతను పరిశీలనగా చూశాడు.

"ఆఁ ...సరిపోతుందిలే. అదో...ఆ పక్కన చూడు. కొంచెం ఉబ్బుగా ఉంది. అది కొంచెం తొవ్వు. ఈ పక్క క్రాస్‌గా వుండాది. సక్కగా తొగెయ్. టేపు పట్టుకోని చూడు.

చూసినావా. ఆ పక్కకు ఈ పక్కకు అరడుగు తేడా వుండాది. ఆ కొంచెం తొగెయ్." అంటూ మరో గంటసేపు పని చేపించాడు. గుంతలోతు పెరగడంతో మట్టిని పైకి విసరడం రామచంద్రకు శక్తికి మించిన పనయింది. పళ్ల బిగువున పనిచేశాడు.

"ఇంగ చాల్లేయ్యా. పొద్దుపోయింది. ఇంకేమన్నా కొరవుంటే మేస్త్రీలు చూసుకుంటార్లే. పైకి రా." అన్నాడతను.

అతికష్టంమీద గడ్డకు చేరాడు రామచంద్ర. కాళ్లు చేతులు కడుక్కొన్నాడు. సంచిలోంచి చొక్కా తీసి వేసుకున్నాడు. కళ్లు మూతలు పడుతున్నాయి. అడుగులు కదలమంటున్నాయి. ఏదో విధంగా వూరికి పోతే చాలు. నాయన్ను చూస్తే చాలు అనుకొన్నాడు.

"యిందో" అంటూ పదిరూపాయల కాగితాలిచ్చాడతను.

రామచంద్ర వాటిని తీసుకుని లెక్కబెట్టాడు. నాలుగున్నాయంతే.

"సరిపోయిండ్లా" అన్నాడతను.

"పద్దన్నే వచ్చినా. రాత్రి పన్నెండవుతాండాది కదాసార్. రెండు రోజుల కూలియియ్యాల."

"బళేవోనివే...ఎంత పనిది. నీనింటి కాలా అంతే. నువ్వు పనిలో దిగిందే మధ్యానాలకు కదా. అట్ల లెక్కేసినా ఒగరోజు పని చేసినావంతే. మధ్యానం అన్నానికి యిచ్చిన పదిపోతే తక్కిన నలభై యిచ్చినా"అన్నాడతను నవ్వుతూ.

"ఇంగో ఇరవయన్నా ఈసార్"

"లేదు లేదు...నీకివ్వాలని కరెక్ట్‌గా యాబయి రూపాయలు జోబులో పెట్టుకోనున్నే. కావాలంటే జోబీచూడు. ఖాళీగా వుండాది. మధ్యానం మా భార్య 'రేపిద్దాంలే కూలి. యాబయి ఈ అవసరం వుంది" అనింది. నేనే ఈలా. నువ్వు వూరికి పోవాలన్నావు కదా. యింగోసారి పనికి వచ్చినప్పుడు పది రూపాయలు ఎగేసి యిస్తాలే."

అతన్తో ఎక్కువసేపు మాట్లాడే ఓపిక కూడా లేకపోవడంతో మౌనంగా బయల్దేరాడు రామచంద్ర.

"యిప్పుడు బస్సులుండవు. రోడ్డు పక్కన చెట్లకింద పడుకో. చల్లగా వుంటాదిలే. మొబ్బుతోనే బస్సెక్కేయి" అంటూ వుచిత సలహా యిచ్చాడతను.

అతని మాటలు విన్నాడో లేదో, మౌనంగా వచ్చి రోడ్డెక్కాడు రామచంద్ర. వీధి దీపాలు కాంతిగా వెలుగుతున్నాయి. అయినా మసకగా వుందతనికి. బాగా నీరసంగా వున్నట్లుంది. అడుగులు తడబడుతున్నాయి. రోడ్డు డివైడర్ మీదున్న పచ్చికలో వెళ్ళకిలా పడుకున్నాడు. చేతిసంచిని తలకింద పెట్టుకున్నాడు. ఆకలి...పేగులు చుట్టక పోతున్నట్లుండటంతో పక్కకు తిరిగి కాళ్లు ముడుచుకుని పడుకున్నాడు. 'నాయనకెట్లుందో ఏమో....నాయన్ను చూడాల' అనుకుంటున్నాడు. నిద్రో, కళ్లు తిరగడమో అర్థం కాలేదు రామచంద్రకు. అలా ఎంతసేపున్నాడో

కూడా తెలీలేదు. సుడిగుండంలో చిక్కుకున్నట్లుంది అతనికి. తొడమీద చురుగ్గా తగలడంతో మగతగా కళ్లు తెరిచాడు. ఎదురుగా పోలీసులు, జీపు. వాళ్లేం అడుగుతున్నారో, తనేం చెబుతున్నాడో తెలీలేదు.

"ఫుల్‌గా తాగేసి పడుకోనుండాడు నా కొడుకు. ఏసకపొండి జీపులో" అన్నాడొక పోలీసు. పిచ్చికుక్కను ఈడ్చినట్లు ఈడ్చి జీపులో వేశారు. "నాయనకు ఎట్లుందో ఏమో...నాయన్ను చూడాల" అని కలవరిస్తున్నాడు రామచంద్ర.

నేరస్థుల కోసం అన్వేషిస్తూ పెట్రోలింగ్ జీపు ముందుకు కదిలింది.

*ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, జనవరి 30, 2004*